# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# గ్లోరియా

"ఒక్క నిమిషం లో వచ్చేస్తాను, మీరు కూర్చోండి, పార్కింగ్ లోనే ఉంది కార్!, కనక మనకేమీ ప్రాబ్లెం లేదు"

అంటూ చెప్తోందో, పరిగెడుతోందో తెలీకుండా కార్ లోంచి దిగి, పెద్ద, పెద్ద అంగలు వేస్తూ పరిగెత్తింది గ్లోరియా, నేను పిలిచిన టాక్సీ డ్రైవర్..

శాన్ ఫ్రాన్ సిస్కో నగరం లో జరుగుతున్న అతి పెద్ద కాన్ ఫరెన్స్ కి వచ్చాను నేను. నాలుగురోజుల పాటు జరిగే ఆ మీటింగ్ వల్ల నగరమంతా దేశ విదేశాలనుంచి వచ్చిన అతిథిలతో కిటకిటలాడిపోతోంది. హోటళ్ళు, రెస్టారెంట్లు, టాక్సీలు ఇలా ఒకటనేమిటి? ఏవీ వచ్చిన వారికి సరిపోనంతగా ఉంది పరిస్థితి.

నేను ఉండేది దగ్గర ఉన్న మరో చిన్న టౌన్ కావడం వల్ల నాకు హోటల్ అవసరం పడలేదు కానీ పార్కింగ్ లాంటివన్నీ కొద్దిగా కష్టమే అయ్యింది. అందుకే నేను చాలా ముందుగానే ఆన్ లైన్ లో పార్కింగ్ బుక్ చేసుకుని అక్కడ కార్ పెట్టుకున్నాను. అందుకని మిగతా మీటింగ్ లకి వెళ్ళడానికి టాక్సీ పిలవవలస్ వచ్చి 'ఉబర్ కాబ్' పిలిచాను.

ఆ ట్రాఫిక్ లో అది రావడానికి కూడా చాలా ఆలస్యం అవుతూ ఉండడం వల్ల నాకు కొద్దిగా హడావిడిగా ఉంది. మీటింగ్ కి గంటన్నర టైముది, వెళ్ళవలసిన దూరానికి నలభై ఐదు నిమిషాలు పడుతుందని సూచిస్తోంది ఫోన్ లో మేప్.

"ఆలస్య మైంది, సారీ, అమెరికాలో ట్రాఫిక్ అంతా ఈరోజు ఇక్కడే ఉన్నట్టుంది, సారీ!!" అంటూనే ఒక్క నిమిషం అంటూ పరిగెత్తిన ఆమెని చూస్తే నాకు కొద్దిగా చిరాకొచ్చిన మాట వాస్తవం..

కానీ ఆమె పరిగెడుతున్న దిశవైపు చూసి నాకెంతో ఆశ్చర్యం వేసింది..

ఇంతలో " మేము ట్రాఫిక్ లో చిక్కుకు పోయాము, మరో అరగంట ఆలస్యమవుతుంది, మీకు ఓకేనా?" అంటూ క్లయింట్ దగ్గరనించి వచ్చిన మెసేజ్ కొంత తెరిపి నిచ్చింది.

గ్లోరియా మీదకి దృష్టి నిశితమైంది..

పెద్ద పెద్ద అంగలతో వెళ్ళిన గ్లోరియా కాన్ఫరెన్స్ ముందర బాటకి ఒకవైపు కూర్చున్న ఒక అమ్మాయి దగ్గరకు వెళ్ళి జేబులోంచి ఏదో తీసి ఇచ్చింది. దూరం మరీ ఎక్కువ లేనందువల్ల వారిద్దరి మధ్యా ఏం మాటలు జరుగుతున్నాయో, తెలీడం లేదు కానీ, దృశ్యం స్పష్టంగానే కనిపిస్తోంది.

ఆ అమ్మాయి చేతులు జోడిస్తూ ఏదో అంటోంది..

గ్లోరియా తన చేతితో ఆ అమ్మాయి తల మీద తట్టి, బై చెప్పి మళ్ళీ టాక్సీ వైపు వచ్చేసింది..

" సారీ, సారీ" మీకెంత టైముంది? అంటూ గబ గబా కార్ స్టార్ట్ చేసింది.

" పరవాలేదు, ఇంకో అరగంట లేటుగా మొదలవుతోంది కనక ఓకే, రిలాక్స్." అన్నాను చిరునవ్వుతో.

మెత్తగా నడుస్తోంది కార్..

"ఐ కాంట్ బిలీవ్ దిస్!!" అంది గ్లోరియా హఠాత్తుగా..

" ఏమయింది గ్లోరియా? ఆల్ ఓకే?" అన్నాను చిన్నగా.

" నాకేం కాలేదు ఇప్పుడు, కానీ ఇలాంటివన్నీ అవడం ఎప్పటికైనా ఆగుతుందా, ఆడవాళ్ళకి? అనిపిస్తోంది" రవ్వంత వేదన ఆమె గొంతులో..

" ఏమయింది గ్లోరియా? మీ కభ్యంతరం లేకపోతే నే చెప్పండి!" అన్నాను.

" అభ్యంతరం ఏమీ లేదు.. ఆ అమ్మాయిని చూస్తే జాలేసింది" అంది.

" ఎవరా అమ్మాయి? మీకు తెలిసినవాళ్ళా? ఏమయింది తనకి?" అన్నాను.

" మీరు ఆ కాన్ ఫరెన్స్ కే కదా వచ్చారు? మీరు చూడలేదా దారికటూ ఇటూ కూర్చున్న అమ్మాయిలని?" అంది.

" అవునవును, చూశాను" అన్నాను గుర్తు చేసుకుంటూ..

మీటింగ్ కెళ్ళే హడావిడిలో ఎక్కువగా చూడలేదు కానీ బాటకిటూ, అటూ కూర్చున్న అమ్మాయిలని చూశాను. అందులో ఒకళ్ళిద్దరు భారతదేశపు అమ్మాయిలు ఉండడం కూడా గమనించాను.

పక్కన ప్రాం లో ఒకళ్ళో, ఇద్దరో పిల్లలని పెట్టుకుని కూర్చున్నారు వాళ్ళు. వాళ్ళ ముందు ' నో జాబ్, నో ఫుడ్, నో మనీ, హెల్ప్ ప్లీజ్' అన్న బోర్డ్ పెట్టుకున్నారు.

మన దేశపు ఆడపిల్లలు ఉండడం అనే బాధ మనసుని ఆక్షణం పీకిన మాట నిజమే కానీ ఆ టైముకి పర్స్ లోంచి కనీసం ఐదు డాలర్లైనా ఇవ్వాలని తోచలేదు నాకు..

"చూశాను "... అన్నాను నెమ్మదిగా. వాళ్ళకి ఏమీ చెయ్యలేకపోయాననే బాధ నా మనసులో మొదలయింది..

అది గమనించినట్టు..

" మీ కంట్రీ వాళ్ళు కూడా ఉన్నారు కదా, నాకిద్దరు కనిపించారు?" అంది..

" అవును" అన్నాను కొద్దిగా అపరాధ భావంతో.

" అది మరీ టెర్రిబిల్.. ఇంకో దేశాన్నించి వచ్చి ఇలాంటి పరిస్థితిలోకి రావడం, నిజంగా దారుణం. ఐ డోంట్ నో వెన్ విల్ దిస్ ఎండ్!" అంది బాధగా.

" నిజమే, మీరిలా వెళ్ళి సహాయం చెయ్యడం చాలా బావుంది.. నేను కూడా మీ స్ఫూర్తితో నాకు వీలైనంత ఇస్తాను కనీసం ఒక్కరికైనా" అన్నాను మనస్ఫూర్తిగా..

"థాంక్ యూ.. ఇలాంటివెప్పుడు చూసినా నేనెంతో కదిలిపోతాను.. ఎందుకో తెలుసా లీలా, నేను ఒకప్పుడు అదే స్థితిలో ఉన్నాను.. ఆ అమ్మాయిలు ఇలా ఎందుకయ్యరో, వాళ్ళకి ఈ దేశంలో ఉండడానికి కావలసినవెందుకు లేవో? ఇవన్నీ తెలుసుకునే ధైర్యం నాకు లేదు.. ఒకప్పటి నిలవ నీడ లేని నా స్థితి గుర్తొచ్చి నా హృదయం బాధతో మెలి తిరుగుతుంది.. అందుకే నేనివ్వగలిగినంత ఇచ్చేసి మళ్ళీ వెనుతిరిగి చూడకుండా వచ్చేస్తాను..

నాకు వీలైతే ఇలాంటి వారందరి కష్టాలూ తీర్చాలని ఉంటుంది.. కానీ నాకంత అవకాశం లేదు. 'ఐ విష్ ఐ వస్ బార్న్ రిచ్!'" అంది.. ఏ జ్ఞాపకాలు తిరిగాయో ఆమె మనసులో, కళ్ళనిండిన నీటిని టిష్యూతో తుడుచుకుంది.. రెండు క్షణాలు ఇద్దరం మాట్లాడలేదు.

"మనసు ఉండాలే కానీ రిచ్ అయ్యి ఉండక్కరలేదు కదా! " అన్న మాట నా నోటి వరకూ వచ్చింది, ఎందుకనలేదొ మరి నేను ఆమెతో?

అప్పటివరకూ నేను ఆ కోణం లో ఆలోచించలేదు..

తల్లి తండ్రులు చూసినదో, తమంత తాముగా ఇష్టపడో అమెరికా సంబంధాలనో ఏదో కారణం చేత పెళ్ళిళ్ళు చేసుకుని వచ్చి ఈ దేశం కాని దేశంలో చేతిలో పైసాలేకపోవడం, అలా ఆరుబయట చలిలో, ఎండలో పిల్లలని పెట్టుకుని సహాయం అర్ధించవలసి రావడం ఎంత దురదృష్టం? ఏందుకు ఇలా అయిపోయారు? ఏదీ కుదరకపోతే కనీసం తమ దేశానికి వెళ్ళిపోలేరా? అనుకున్నాను..

వెళ్ళడానికి కూడా డబ్బు లేదా? భర్తలు బాధ పెట్టారా? ఇంట్లో చెప్పుకోలేకా?' ఇలా పరి పరి విధాలా సాగుతున్నాయి నా ఆలోచనలు..

" నాకు తెలుసు లీలా, మీ మనసులో ఏం ఆలోచన నడుస్తోందో? మీకు ఆలోచనే, నాకు అనుభవం కూడా. ఐ వెంట్ త్రూ దిస్.. అబ్యూజివ్ మేరేజ్ లో ఉండడం అంటే ఏమిటో నాకుతెలుసు.. మాది ఈ దేశం కాదు. పెడ్రో, నేను ప్రేమిచి పెళ్ళి చేసుకున్నాం, మా మెక్సికోలో కంటే ఇక్కడ ఉద్యోగావకాశాలు బాగుంటాయని ఇక్కడికి వచ్చాము. చిన్న స్టుడియో అపార్ట్మెంట్ లో మొదలుపెట్టాము మా జీవితాన్ని. మొదట్లో చాలా సుఖంగా సాగిన మా జీవీతం, మారడానికి పెద్ద కాలం పట్టలేదు, పెద్ద ప్రత్యేకమైన కారణాలు లేవు.. చెడు అలవాట్లకి మనిషి దాసుడవడానికి ఎక్కువ కాలం అక్కరలేదు..

' తనకి తగ్గ ఉద్యోగం కాదనడం'

' నాకు తనకన్నా కొద్దిగా, చాలా కొద్దిగా ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం దొరకడం'

' నాకు వారానికి మూడు రోజులు నేను పనిచేసే హోటల్ లో నైట్ డ్యూటీ ఉండడం, ఇంకా కార్ లేదు కనక పొద్దున్నే నా తోటి ఉద్యోగి టాం నన్ను దింపడం'

' కూరలో ఉప్పు తక్కువ అవడం, చికెన్ లేకపోవడం'

ఇలా ఎన్నో కారణాలు. కోపం తెచ్చుకోవడానికి, నా మీద చూపడానికి..

సహనానికి కూడా హద్దుంది, ఉండాలి. అది పెట్టుకోకపోతే మనం వీధిన పడే రోజే హద్దవుతుంది.. అద్దె కట్టలేక, చేతిలో డబ్బులేక గజ గజ వణికే చలిలో చేతిలో ఆరునెలల పిల్లాడితో వీధిలో నిలబడినప్పుడు నాకు మొదటిసారి బ్రతుకు ఎంత భయంకరం గా ఉంటుందో అర్ధం అయింది.. నన్ను చీకటిలో వదిలే పారిపోయిన పెడ్రో మీద నాకుకోపం రాలేదు చిత్రంగా.

' ఇప్పుడు నేను ఏం చెయ్యాలి?' అని మాత్రమే అనిపించింది..

ఆరు డాలర్లున్నాయి నా కోటులో.. ఇలాగే, సరిగ్గా ఇలాగే కూర్చున్నాను, కాదు ఎవరో కూర్చో బెట్టారు.. నా లాంటి వాళ్ళే చెయ్యి పట్టి మరీ..ఆ క్షణం భూమి పగిలి అందులోకి నేను వెళ్ళిపోతే బాగుండుననిపించింది తెలుసా? నాలుగు రోజుకంటే అలా ఉండడం నావల్ల కాలేదు.

అప్పుడు దగ్గరలో ' వీ ఆర్ హైరింగ్' అన్న బోర్డ్ చూసి ఆ సూపర్ మార్కెట్ కి వెళ్ళాను. మేనేజర్ తో పరిస్థితి చెప్పాను. అలా ఎందుకు చేశానో తెలీదు, నాకు తోచిన ఒకే ఒక మార్గం. ఒడిలో పసివాడిని పెట్టుకుని దేహీ అనలేకపోయాను.. దేవుడే చూపించిన దారేమో అది..

కాథరీన్ పాపం నా కథ విని కదిలిపోయింది.. ఎంత మంచిదో, ఈ మధ్యనే!!..” అంటూ ఆగింది..

మనసు కారుస్తున్న కన్నీళ్ళని గొంతులో అదిమి పట్టడం స్పష్టం గా తెలుస్తోంది..

“ఆవిడ మొదట తన షాప్ బేస్ మెంట్ లో నన్ను ఉంచేలా ప్రయత్నించి ఒక మూల చిన్న చోటిచ్చింది.. ఆ తర్వాత పీటర్ పరిచయమయ్యాడు. తనకొక పాప అప్పటికి, భార్య కేన్సర్ తో పోయింది, మా పరిచయం ప్రేమగా మారింది. గతంతో సంబంధం లేదనుకున్నాం.. మేమిద్దరం కలిసి ఉండడం మొదలు పెట్టాం. ఇద్దరికీ సాధారణంగా వేర్వేరు షిఫ్ట్ లు ఉండేవి.. అలా ఇద్దరు పిల్లలని ఒకరే చూసుకునే వాళ్ళం, ఆ సహాయమే మా ప్రేమకి నాంది, ఇప్పటికీ అదే పునాది.. ఆ పిల్లలే మా ఇద్దరికీ పిల్లలు. దగ్గరలోనే ఉన్న మెర్సీడ్ అన్న అతని ఊరికి వెళ్ళిపోయాం.. ఆరేళ్ళుగా అక్కడే ఉంటున్నాం. చాలా చిన్న ఇల్లు, ఇద్దరు పిల్లలు. సుఖంగా ఉన్నాం, కానీ పిల్లలు పెరుగుతున్నారు.. ఒక్క రూము, వంట గది ఉన్న ఇల్లు చాలా ఇరుగ్గా ఉంది మా నలుగురికీ. అందుకే ఇల్లు కొనుక్కోవాలన్నది మా కల.. మా ఇద్దరికీ ఉన్న ఆర్థిక వనరులతో అది సాధ్యం కాదు..

అందుకని ఒక రోజు నేనే ' ఉబర్ డ్రైవర్ గా పని చేస్తాను' అన్నాను. మీకు తెలుసా? పీటర్ కి డ్రైవింగ్ సరిగా రాదు. నాకు చిన్నప్పటినించీ ఎంతో సరదా. అన్నింటిలోనూ నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేసే పీటర్ ఆరోజెందుకో ' గ్లోరీ, కష్టమైన పని కదా, మన చిన్న ఊర్లో ఏం లాభం ఉంటుంది?" అన్నాడు. అప్పుడు చెప్పాను నా మనసులో ఉన్న ప్లాన్.. పీటర్ ఆశ్చర్యపోయేలా. అంది..

ఇప్పుడామె గొంతులో చిన్న గర్వం.. నవ్వు..

" ఏమిటా ప్లాన్?" ఆసక్తిగా అడిగాను.. మళ్ళీ నవ్వింది

" నాకు తెలుసు, మెర్సీడ్ అన్న చిన్న ఊరిలో ఏమీ పెద్ద బిజినెస్ ఉండదు. అది యూనివర్సిటీ టవున్ కనక కాలేజీలు మొదలయ్యేప్పుడు, పిల్లల స్నాతకోత్సవాలప్పుడు మాత్రమే కాస్త జనాలుంటారు,మిగతా వేళల్లో ఎవరూ ఉండరు.. అందుకే నేను ఇక్కడ కాకుండా శాన్ ఫ్రాన్ సిస్కో లో నడుపుతాను టాక్సీ" అన్నాను..

" అంటే? నువ్వక్కడ ఉంటావా? ఏం ప్లాన్ ఇది? నిన్నొదిలేసి మేమెలా ఉంటాం?" అన్నాడు పీటర్.

" దానికి మీరేమన్నారు? అసలు మీ ప్లాన్ ఏమిటి?" అన్నాను నేను ఆత్రం పట్టలేక..

అప్పటికి సిగ్నల్ దగ్గర కార్ ఆగి నాలుగు నిమిషాలయింది.. నా మీటింగ్ కొద్దిగా వాయిదా పడడంతో పూర్తిగా రిలాక్స్ అయిపోయాను నేను..

నవ్వింది గ్లోరియా..

" సింపుల్.. వారానికి మూడు రోజులు మాత్రమే శాన్ ఫ్రాన్ సిస్కో ' లో ఉంటాను. మిగతా నాలుగురోజులు మా ఊర్లోనే!" అంది..

" ఓ!" అన్నాను..

ఆ తర్వాత అడిగాను " ఇక్కడ మరి ఎక్కడ ఉంటారు? ఏదైనా అద్దెకు తీసుకున్నారా?" అన్నాను..

'అంత లక్ లేదు నాకు.. అంత డబ్బు లేదు మా దగ్గర.. నేనున్న మూడు రోజులూ కార్లోనే పడుకుంటాను.. వాతావరణన్ని బట్టి ఏసీ, లేదా హీటర్ వేసుకుని' అంది.. గ్లోరియా నెమ్మదిగా..

అదిరిపడ్డాను. “నిజమా?" అన్నాను..

" అంతే కదా! ఏం చెయ్యగలను అంతకంటే? వెనక బూట్ చూశారు కదా, సీట్లు పైకి పెట్టేసి అక్కడే చిన్న దిండు పెట్టుకుని దుప్పటి కప్పుకుని పడుకుంటాను. శాండ్ విచ్ లేదా పీజా ఏదో ఒకటి కొనుక్కుని తినేసి మంచివి, భద్రత ఉన్నవి అన్న ఏరియాలకి దగ్గరగా రాత్రి పదింటికి అలా

కార్ పార్క్ చేసి నెమ్మదిగా వెనక్కి వెళ్ళిపోతా.. ఫోన్ లో పాటలు వింటూ, లేదా నా పిల్లలతో, పీటర్ తో చాట్ చేస్తూ నిద్ర వచ్చేవరకూ పెద్దగా శబ్దం చెయ్యకుండా ఉంటాను. ఆపైన నిద్రపోతాను, పొద్దున్నే ఆరుగంటలకల్లా పని మొదలు పెట్టేస్తా.. ఈ రోజు బుధవారం కదా, రేపు రాత్రి నా పిల్లలని కలుసుకుంటాను." అంది ఒకే గుక్కలో.

వింటున్నది అర్ధమవడానికి రెండు నిమిషాలు పట్టింది నాకు..

" ఓ మైగాడ్! ఎంత కష్టం కదా? ఇలా చెయ్యడం సేఫేనా? ఎక్కడైనా ఉండచ్చు కదా, తక్కువ అద్దెలో కూడా ఉండడానికి ప్లేస్ లు దొరుకుతాయి కదా?" అన్నాను అంత కన్నా ఏమనాలో తెలీలేదు..

" భగవంతుడి దయవల్ల ఇప్పటివరకూ ఏమీ అవలేదు, కానీ నేను పీటర్ ప్రతీ ఒక్క డాలర్, ఎక్కడ వీలైతే అక్కడే దాచి త్వరలోనే ఇల్లు కొనాలని పట్టుదలగా ఉన్నాము.. మా పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయి ఇల్లు వదిలి పోకముందే వాళ్ళిద్దరికీ తమవైన గదులుండాలని, ఆ ఇంటిని వాళ్ళిద్దరూ ఎంజాయ్ చెయ్యాలని మా ఆశ. ఇద్దరం పేదరికంలోనే పుట్టాం, పెరిగాం.. స్వంత ఇల్లంటే ఎలా ఉంటుందో తనకి తెలీదు, నిలవ నీడ లేకపోవడం ఎంత దుర్భరమో! నాకు తెలుసు. అందుకే.. ఇది సులువు కాదు, కానీ పర్మనెంట్ కూడా కాదు.. మరో కొన్ని నెలలు, లేదా మరొక్క సంవత్సరం.. అంతే, ఆపైన నేను అక్కడే ఏదో ఒక పని చూసుకుంటా." అంది..

ఆశ ఆమె గొంతు నిండా..

" మరి ఆ అమ్మాయికి ఎందుకు డబ్బులిచ్చారు?" అన్నాను. అడిగాకా కానీ తెలీలేదు నాకు,నేను వేసినది ఎంత అర్ధం లేని ప్రశ్నో?.

జవాబుగా నవ్వింది గ్లోరియా..

' ఇంత చెప్పినా ఇదే అడుగుతున్నావా?' అన్న అర్ధం గోచరించింది నాకు..

' ఐ మీన్" అంటూ ఏదో అనబోతున్న నాతో

" ఐ నో వాట్ యూ మీన్, ప్రతీ పెన్నీ దాచుకుంటున్నారు కదా, ఈ దానాలెందుకు? మధ్యలో అన్నది మీ అనుమానం కదా?" అంది

"ఛా ఛా, అలా కాదు.."

"నాకుంచుకున్న దాంట్లోంచే ఇచ్చాను, ఇంటికని ఉంచిన దాంట్లోంచి కాదు.. అర్ధం కాలేదా? రాత్రికి.. కాఫీ తాగేస్తాను..

ఊరికే డబ్బిచ్చి వచ్చెయ్యలేదు, ఆ అమ్మాయి ఏం చెయ్యాలో? కూడా చెప్పాను.. నా స్నేహితురాలి నంబర్ ఇచ్చి వచ్చాను, హోప్ పుల్లీ మెర్సీ ఏదో ఒక దారి చూపిస్తుంది" అంటూ నేను దిగవలసిన చోట కార్ ఆపింది..

"ఎక్కడుంటారు పిలవకుండానే సహాయం చేసే దేవతలు? ఇలాంటి వారిలో కాక!!".. అప్రయత్నంగానే పది డాలర్ల టిప్ ఇచ్చాను గ్లోరియాకి. కనీసం కాఫీ తాగి అర్ధాకలితో పడుకునే అవసరం తప్పించడానికి..

రేపు ఆ అమ్మాయిల్లో కనీసం ఒక్కరిదైనా పరిస్థితి కనుక్కుని నాకు చేతనైన సహాయం చేస్తాననే నమ్మకం నాకు వచ్చింది.. దానికి కావలసిన స్ఫూర్తి గ్లోరియా ఇచ్చింది.

నెమ్మదిగా గ్లోరియా భుజం మీద నా చెయ్యి వేసి నొక్కాను.. ఆమెని అభినందిచడానికి నా దగ్గర మాటల్లేవు..

'స్పందించడం మానవత్వం, చేతనైన సహాయం చెయ్యడం దైవత్వం' అని చూపిన దేవదూత లా నవ్వింది గ్లోరియా.

స్టీరింగ్ పక్కనున్న అద్దంలో ఆమె తెల్లని పలువరస చీకట్లో తళుకు తారలా మెరిసింది...

Click here to share your comments on this story